8CTR1:8CTR1.qxd 7/7/2026 11:26 PM Page 1



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## మామిడి రైతును
# ముంచుతున్న ర్యాంపులు

చిత్తూరు, జులై 7 ప్రభాతవార్త:
జిల్లాలోని మామిడి రైతులకు ర్యాంపులు కలెక్టర్ నిర్ణయించిన ధరను సైతం చెల్లించకుండా భారీగా కోతలు విధించడంతో మామిడి పంట కోత కోయడానికి అప్పులు చేసిన రైతుకు చేతిలో చిల్లిగవ్వ మిగలని పరిస్థితి ఏర్పడింది. ఈ మామిడి సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 52 ర్యాంపులు ఏర్పాటు అయ్యాయి. ఈ ర్యాంపుల వద్దకు మామిడి రైతులు తాము పండించిన తోతాపురి మామిడికి తీసుకువస్తే వాటిని ర్యాంపు యాజమానులు కొనుగోలు చేసి ఆపై ర్యాంపుల నుండి తాము ఒప్పందం చేసుకున్న పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడిని తరలిస్తుంటాయి. అత్యధిక మామిడి రైతులు సైతం నేరుగా తమ మామిడి పండ్లను పల్ప్ ఫ్యాక్టరీల వద్దకు తీసుకెళ్తే రోజుల తరబడి క్యూలో వుండాల్సిన పరిస్థితి వుంటుందని, ర్యాంపులకు వెళితే అక్కడ కేజీకి ఒక రూపాయి తక్కువ లభించినా అప్పటికప్పుడు కాయలు అన్‌లోడ్ అవుతాయని భావించి ర్యాంపులకు వెళ్ళి మామిడి కాయలను రైతులు అన్‌లోడ్ చేస్తున్నారు. ఈ పరిస్థితిని అసరాగా చేసుకున్న ర్యాంపు యాజమానులు రైతులను నట్టేట ముంచడం ప్రారంభించారు. తాము కేజీ తోతాపురి మామిడికి రూ.3 కంటే ఎక్కువ చెల్లించడం సాధ్యం కాదని, దీనికంటే ఎక్కువ డబ్బులు కావాలంటే మీరు పల్ప్ ఫ్యాక్టరీలకు తీసుకెళ్ళాలని స్పష్టం చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగం కేజీకి రూ.4 చెల్లించాలని పేర్కొంటుండటంతో ఆ మేరకు తమ కాయలు కొనుగోలు చేయాలని మామిడి రైతులు కొంతమందిది ర్యాంపు నిర్వాహకులను ప్రాధేయపడినప్పటికీ ఫలితం వుండటం లేదు. ర్యాంపుల్లో మామిడి రైతులకు జరుగుతున్న అన్యాయంను గుర్తించి జిల్లా అధికార యంత్రాంగం సత్వరం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది.

# ర్యాంపులు మూతకు చర్యలు
## - మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్



యాదమరిలోని మామిడి ర్యాంపును తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్

చిత్తూరు, జులై 7 ప్రభాతవార్త:
మామిడి రైతులకు కలెక్టర్ నిర్ణయించిన ధర కంటే తక్కువ చెల్లిస్తున్న పలు ర్యాంపులను మూసి వేస్తున్నట్లు మార్కెటింగ్‌శాఖ ఎడి పరమేశ్వర్ పేర్కొన్నారు. యాదమరి మండలంలోని రెండు ర్యాంపుల్లో మామిడి రైతులకు తక్కువ చెల్లింపులు చేస్తున్నారని 'ప్రభాతవార్త'తో ప్రచురితం కావడంతో మంగళవారం మార్కెడింగ్ శాఖ ఎడి పరమేశ్వర్ ర్యాంపులను తనిఖీ చేశారు. ఈ తనిఖీ సందర్భంగా ర్యాంపులకు మామిడి సరఫరా చేస్తున్న మామిడి రైతులను ఆయన మాట్లాడితే తమకు ర్యాంపు నిర్వాహకులు కేజీకి రూ.3 మాత్రమే చెల్లిస్తున్నారని స్పష్టం చేశారు. దీంతో మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్ ఈ విషయంను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళితే ర్యాంపుల వద్ద పెద్దగా మామిడి రైతులు లేకుంటే ర్యాంపును మూసి వేయాలని ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని పులిచెర్ల, రొంపిచెర్ల, జిడినెల్లూరు, ఎస్ఆర్ పురం, పెనుమూరు, యాదమరి, గుడిపాల, చిత్తూరు మండలాల్లో వున్న అన్ని ర్యాంపులను బుధవారం సాయంత్రానికి మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే ర్యాంపుల్లో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు బుధవారం సాయంత్రానికి సంబంధిత మొత్తం డేటాను సేకరించి మార్కెట్ కమిటీ కార్యదర్శులకు సమర్పించాలని ఆదేశించారు. అలాగే రైతులు బుధవారం సాయంత్రం నుండి ర్యాంపులకు మామిడి కాయలను తీసుకువస్తే ప్రభుత్వం మంజూరు చేసే సబ్సిడీ రాదని పేర్కొన్నారు. అలాగే బంగారుపాళ్యం, తవణంపల్లి మండలాల్లో వున్న ర్యాంపులు ఈ నెల 10 తేదీకి మూసివేయనున్నట్లు ఆయన తెలిపారు.

## హైరిస్క్ గర్భవతులకు
# పక్కా వైద్య సేవలు
## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి




డిఎంహెచ్‌ఓ డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం.

చిత్తూరు, జులై 7 ప్రభాతవార్త:
హైరిస్క్ గర్భవతులను సకాలంలో గుర్తించి తరచూ వారిని స్త్రీ వ్యాధి నిపుణులతో వైద్యం చేయించడంతో పాటు సమస్య ఉత్పన్నం అయితే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి పక్కా వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అన్నారు. డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం జిల్లాలో జరిగిన 3 మాతృ మరణాలు, 5 శిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగ శశిభూషణ్‌రెడ్డి అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఓ మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చిన సమయం నుండి వారిని సాధారణ కాన్పు కోసం సిద్ధం చేయాలన్నారు. అలాగే మూఢనమ్మకాలు, ముహుర్తాలతో ప్రసవాలు చేయరాదని, సాధ్యమైన మేరకు సిజేరియన్ ఆపరేషన్ జరగకుండా చూడాలని, గర్భస్థ సమయంలో పౌష్టికాహారంతో పాటు అన్ని జాగ్రత్తలు తీసుకుంటే రక్తహీనత లేకుండా మాతృమరణాలను కట్టడి చేయవచ్చునన్నారు. అలాగే ప్రతి హైరిస్క్ గర్భిణీని సూపర్‌వైజర్ స్టాఫ్‌తో మ్యాపింగ్ చేయాలని, వీరు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. గర్భవతులకు వీలైనంత త్వరగా చికిత్స అందిస్తే మాతృ, శిశు మరణాలను నివారించడానికి చర్యలు తీసుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పద్మాంజలి దేవి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ లత, డాక్టర్ శరణ్య, డాక్టర్ స్పందన, డాక్టర్ అనూష, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ అధికారి పిడి వెంకటేశ్వరీ, మోహన్‌బాబు, వివిధ పిహెచ్‌సిల డాక్టర్లు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# 'సర్' డిజిటల్ ప్రక్రియ పూర్తికి చర్యలు
## - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జులై 7 ప్రభాతవార్త:
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో తప్పులు లేకుండా డిజిటల్ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ కోరారు. జిల్లాలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ దాదాపు పూర్తయ్యిందని, అయితే వాటిని డిజిటల్ చేసే ప్రక్రియ మందకొడిగా సాగుతు న్నదన్నారు. ఇప్పటికే కొంత శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యిందని, ఈ నెల 15వ తేదీతో గడువు ముగియనున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు అదనపు అధికారులను జిల్లా వ్యాప్తంగా నియమించడం జరిగిందన్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1,511 పోలింగ్ స్టేషన్లు వున్నాయని, ఈ పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 13,40,126 లక్షల మంది ఓటర్లుగా వున్నారన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 13,36,059 లక్షల మందికి అంటే 99.70 శాతం ఇన్యుమనేషన్ ఫారాలను పంపిణీ చేయడం పూర్తయ్యిందన్నారు.

# అభివృద్ధి పూచీ నాది .. ప్రజల్లో తిరిగే బాధ్యత మీది !!

## అధికారులు.. నేతలకు సిఎం ఆదేశం !!
## - గతం కంటే భిన్నంగా చంద్రబాబు కుప్పం పర్యటన



కుప్పం, జూలై 7 ప్రభాతవార్త
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు రోజుల కుప్పం పర్యటన విజయవంతమైంది. తన మూడు రోజుల పర్యటనలో సిఎం కుప్పం చరిత్రలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. కుప్పంలో అభివృద్ధికి ఇది ఆరంభం మాత్రమేనని హింట్ ఇచ్చారు. దాదాపు 9322కోట్లతో కుప్పంలో భారీ పరిశ్రమలకు శంకుస్థాపనలు, ఎంఒయులు, ప్రారంభోత్సవాలు చేపట్టారు. కుప్పంలో సుమారు 130కోట్లకు పైబడి అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా సిఎం చంద్రబాబునాయుడు యువతకు భారీ ఎత్తున ఉపాధి భరోసా కల్పించారు. మున్ముందు కుప్పం ప్రాంతంలోనే 80వేల దాకా ఉద్యోగాలు లభిస్తాయని బయటివారు ఇక ఇక్కడకు వచ్చి పనిచేసే అవకాశాలు ఉంటాయని స్పష్టం చేశారు. మరో పక్క రైతులు, మహిళలకు కూడా పరిశ్రమలు రావడంతో ఆదాయమార్గాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఇంటికో పారిశ్రామిక వేత్త కార్యక్రమంకు కుప్పం నుంచే శ్రీకారం చుడతామన్నారు.
అభివృద్ధి పూచీ నాది : కుప్పం ప్రాంతం అభివృద్ధి చేసే బాధ్యత తనది అని దాన్ని అందింపుచ్చుకోవాల్సింది ఈ ప్రాంత ప్రజలేనని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు. బెంగళూరును మించిన చక్కటి చేపడుతున్నాం వాటిని నోరు తెరచి ప్రజలకు ఎందుకు చెప్పలేకపోతున్నామనే కోణంలో అధికారులు, నాయకులు ఆలోచించుకోవాలని పేర్కొన్నారు. ఇక పార్టీ పరంగా జరిపిన సమీక్షలో అయితే సిఎం చంద్రబాబు తన పనితీరు ఎలా ఉంటుందో కుండబద్దలు కొట్టారు. పార్టీలో పనిచేసేవారికే పదవులు ఉంటాయని అది కూడా కార్యకర్తల మనోభీష్టాల మేరకే పదవులు కట్టబెడతామని ప్రకటించారు. జనంలో తిరిగే నాయకులకే ప్రాధాన్యత ఉంటుందని పార్టీ అధినేతగా సిఎం చంద్రబాబు పార్టీ శ్రేణులకు సుస్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని ఇందుకు సన్నద్ధం కావాలని పార్టీ శ్రేణులను ఆదేశించారు. అలాగే తన పర్యటనలో భాగంగా ప్రజలనుంచి వచ్చిన వినతులను సిఎం చంద్రబాబు నేరుగా స్వీకరించి వాటి పరిష్కారంకు హామీ ఇచ్చారు. ఏది ఏమైనా ఈ సారి సిఎం చంద్రబాబు కుప్పం పర్యటన గతం కంటే భిన్నంగా జరగడం విశేషం.

# 'సర్' సర్వేను పారదర్శకంగా నిష్పక్షపాతంగా నిర్వహించాలి
## జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్



సర్ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

ఐరాల, జూలై 7 ప్రభాతవార్త:
జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించి తప్పులు లేని ఓటర్ల జాబితాను రూపొందించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పొలకల గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ సర్వేను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బిఎల్‌ఓలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, ఓటర్ల వివరాల నమోదు, డిజిలైఏషన్ ప్రకియను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజలతో మాట్లాడుతూ 2002లో ఓటర్ల జాబితాల్లో అమ్మ, నాన్నల పేర్లను తెలుసుకోవాలన్నారు.అలా చేయకపోతే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం వుందన్నారు. బిఎల్వోలు ఇంటి వద్దకు వచ్చినపుడు ఓటు కోల్పోకుండా చూసుకోవడం మన అందరి బాధ్యత, తప్పకుండా మ్యాపింగ్ చేసుకోవాలన్నారు.2002లో పేరు వుండి అదే విధంగా 2005లో ఓటరు లిస్టులో పేరు వున్న వారు కూడా సెల్ఫ్ మ్యాపింగ్‌చేయించుకుంటే మంచిదన్నారు. అలాంటి వారు బిఎల్వోల వద్దకు వెళ్ళి సెల్ఫ్ మ్యాపింగ్ అని చెప్పాలన్నారు. 2002లో ఓటు హక్కు వయస్సు లేకపోయినా, పేరు లేక పోయినా 2005లో పేరు వున్న వారికి మ్యాపింగ్ వర్తిస్తుందన్నారు.ప్రతి అర్హత కల్గిన ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని, కొత్త ఓటరు నమోదు, మరణించిన వారు ఇతర ప్రాంతాలకు వెళ్ళిన మారిన వారి వివరాలను నిబంధనల మేరకు నమోదు చేయించాలని సూచించారు. డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, తహసీల్దార్, బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.




# ఆహార పదార్థాల విక్రయాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు
## హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్



తిరుపతి కార్పొరేషన్, జూలై 7 ప్రభాతవార్త:
నగరంలో ప్రజలకు విక్రయించే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ తెలిపారు. జిల్లా కలెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు నగరంలోని పలు చోట్ల తయారు చేసే ఐస్ క్రీమ్ తయారీ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలసి దాడులు నిర్వహించామని తెలిపారు. మంగళవారం నగరంలోని బాలాజీ ఐస్ క్రీమ్, కేశవాయన గుంటలోని పలుడా తయారీ సెంటర్, బైరాగి పట్టెడ లోని మాషా అల్లా స్టార్ ఫుడ్ ఫ్యామిలీ రెస్టారెంట్, పాత తిరుచానూరు రోడ్డు లోని గురు దత్త ఎంటర్ప్రైజెస్ డైరీ, స్మూత్ ఐస్ క్రీమ్ తయారీ కేంద్రం నందు తనిఖీ చేశామని తెలిపారు. కేశవాయనగుంటలోని బాలాజీ ఐస్ క్రీమ్, పలువుడా తయారీ సెంటర్ నందు పాడైపోయిన బాదంపప్పు, గడువు ముగిసిన కోన్ ఐస్ క్రీములు, పుల్ల ఐస్ క్రీములు గుర్తించామని తెలిపాటు. పాడైన సరుకును స్వాధీనం చేసుకొని డంపింగ్ యార్డుకు తరలించి నాశనం చేసి తయారీ కేంద్రాన్ని మూసి వేశామని తెలిపారు. తయారీ దారులపై ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే బైరాగి పట్టడ లోని మాషా అల్లా స్టార్ ఫుడ్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను తనిఖీ చేయగా అందులో అపరిశుభ్రమైన వాతావరణాన్ని, చెత్తాచెదారంతో కూడుకున్న కిచెన్, స్టోర్ రూమ్లు, ఫ్లోరింగ్ పగిలి పోయి హోటల్ రూంలు అన్ని బూజు పట్టి ఉండుట, వంటకు వినియోగించు ఆహార పదార్థాలు ప్రజల వినియోగార్థమునకు పనికిరానివిగా ఉండటాన్ని గుర్తించామని తెలిపారు. ఫ్రీజ్ అపరిశుభ్రంగా నిలువ ఉంచిన ఆహార పదార్దాల వద్ద ఎలుకలు ఉండటాన్ని గుర్తించి హోటల్ సీజ్ చేశామని తెలిపారు. నగరపాలక సంస్థ చట్టంలోని సెక్షన్ 492 నుండి 498 వరకు 521 మరియు 541 సెక్షన్ నుండి 54 6 వరకు మరియు సెక్షన్ 622 అనుసరించి హోటల్ ను తాత్కాలికంగా క్లోజ్ చేశామని తెలిపారు. పాత తిరుచానూరు రోడ్డులోని గురు దత్త ఎంటర్ప్రైజెస్ డైరీ స్మూత్ ఐస్ క్రీమ్ తయారీ కేంద్రమునకు వెళ్లి తనిఖీ చేయగా అందులో నిలువ ఉంచిన దాదాపు ఒక టన్ను కోన్ ఐస్ క్రీములు, బాక్స్ ఐస్ క్రీమ్లు, బాల్ ఐస్ క్రీములు తేదీలు అయిపోయి ఎక్స్పైరీ డేట్స్ అయినప్పటికీ వాటిని నిల్వ ఉంచి ప్రజల వినియోగంనకు ఉంచుట గమనించి సదరు ఒకటన్ను సరుకును స్వాధీనం చేసుకుని వారికి పెనాల్టీ విధించి ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నోటీసులు జారీ చేశారు. పిల్లలకు వీధులలో,పాఠశాలల వద్ద బండ్లపై లోకల్ గా తయారు చేసి విక్రయించే ఐస్ క్రీమలు తినిపించకుండా, పిల్లల ఆహార పదార్థాల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకూవాలని తెలిపారు. ఆహార పదార్థాల విషయాలలో ఏదైనా అనుమానం ఉంటే ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లకు గాని నగరపాలక సంస్థ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ తనిఖీల్లో ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్లు, ఫుడ్ సెఫ్టీ ఆఫీసర్లు జగదీశ్, నర్మద, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య, సెక్రటరీ లు, ఇన్స్పెక్టర్లు, మరియూ మైస్త్రీలు పాల్గొన్నారు.




# శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలిలో... అంతర్గత విభేదాలు
## -సమావేశం ఏర్పాటుకు సభ్యుల వత్తిడి



శ్రీకాళహస్తి,జూలై 7 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తుల సంఖ్యతో పాటు అతిథుల తాకిడి పెరుగుతుంది. వారికి మెరుగైన సేవల కోసం ధర్మకర్తల మండలిని నియమిస్తారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి దేవస్థానంకు సభ్యుల సంఖ్య 12 నుంచి 16కు పెంచారు. ధర్మకర్తల మండలిలో సమ న్యాయం కోసం అధికార తెలుగుదేశం, మిత్రపక్షాలు జనసేన, బిజెపిలకు సమాన అవకాశం కల్పించారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి సభ్యులను నియమించారు. ధర్మకర్తల మండలి సమావేశాలు జరుపుతూ భక్తులకు మెరుగైన సేవలందించాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అయితే ప్రస్తుత పాలకమండలి సమావేశాలే జరుపుకోలేని స్థితి చోటు చేసుకుంది. బోర్డు ఏర్పడిన తరువాత మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వచ్చాయి. ఈ సందర్భంగా ఏర్పాట్లపై శాసనసభ్యుని అధ్యక్షతన సమీక్ష జరిపారు. తరువాత శివరాత్రి పూర్తి అయిన తరువాత ఏప్రిల్ 16 సమావేశం జరిపారు. తరువాత మూడు నెలలు గడుస్తున్నా సమావేశాల్లేదు. ఏప్రిల్,మే,జూన్ ఆలయానికి భక్తుల సీజన్. ఈ సమయంలో ప్రభుత్వం ఇక్కడ ఆన్‌లైన్ సేవల అమలుకు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేసింది. దాంతో కొత్త విధానంలో సవాలక్ష సమస్యలను భక్తులు ఎదర్కొంటున్నారు. అయితే ఈ సమస్యపై ధర్మకర్తల మండలి సభ్యులు కానీ చైర్మెన్ కానీ స్పందించిన సందర్భాల్లేదు. బోర్డు సమావేశాల్లేదు. కానీ చైర్మెన్ ప్రతి రోజూ క్రమం తప్పక ఆలయానికి రావటం తన ఏసి ఛాంబర్‌లో కూర్చొటం కాలం గడపటం తప్ప భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి? అభివృద్ధి కార్యక్రమాలు ఏం జరుగుతున్నాయి? నిర్మాణ కార్యక్రమాలు ఎందుకు ఆగాయి. అని పరిశీలించేందుకు సమావేశాలు జరిపిన సందర్భాల్లేదు. ఇటీవల స్థానికంగా ఉండే బోర్డు సభ్యులుకూడా ఆలయంలో జరిగే అధికారిక కార్యక్రమాలకు హాజరు కావటం లేదు. సోమవారం జరిగిన 'స్వర్ణముఖి ప్రక్షాళన'కు కూడా స్థానికంగా ఉన్న బోర్డు సభ్యులు హాజరు కాలేదంటే వారిలో అసంతృప్తి అర్థమౌతుంది.

### సమావేశానికి వత్తిడి...పట్టించుకోని చైర్మెన్:

సాధారణంగా రెండు నెలలకొక మారు అయినా బోర్డు సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధిపై అలాగే జరుగుతున్న పనులకు సంబంధించి భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలి. అధికారులకు దిశ దెశ నిర్దేశం చేయాలి. ఇక ఆలయానికి సంబంధించిన భక్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించాలి. ఆలయంలో పరిపాలన పూర్తిగా గాడితప్పుతుంది. సెక్యూరిటి నియామకాలు గమనిస్తే 60 సంవత్సరాలుదాటిన వారికికూడా సెక్యూరిటిగా నియమిస్తున్నారు. ఇక ఆన్‌లైన్ విధానంలో ప్రసాదాల అమ్మకాలు ఆగమ్యగోచరంగా మారింది. ఇక దళారుల దౌర్జన్యాలు పెచ్చుపెరిగి పోతున్నాయి. కొత్తగా రిజిస్టర్ ఏర్పాటు చేసారు. దాంతో గతంలో దళారులు వచ్చిన వారి నుంచి కనీసం టిక్కెట్లు మొక్కుబడిగా కొనుగోలు చేసే వారు. కొత్త రిజిస్టర్ విధానంతో నమోదుతో శివయ్య ఆదాయాలకు పూర్తిగా గండి పడింది. అయితే ఇక్కడ దళారుల ముసుగులో సాగుతున్న దందా ఏదో ఒక రాజకీయ పార్టీల మద్దతు దారులతోసాగుతున్నదన్న ఆరోపణలు, విమర్శలున్నాయి. మరి సిబ్బంది, అధికారులు ఎవర్ని కట్టడి చేయగలరు? ఇక బోర్డు సమావేశం ఏర్పాటుకు సంబంధించి సభ్యులు తీవ్ర స్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అయితే చైర్మెన్ ఎందుకు స్పందించటం లేదనే అసంతృప్తి చోటు చేసుకుంది.






8CTR 2:8CTR 2.qxd 7/7/2026 11:30 PM Page 1



# వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతో దోమలు కట్టడి



– పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్

**యాదమరి, జులై 7 ప్రభాతవార్త:**
వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే దోమలను కట్టడి చేయవచ్చునని యాదమరి పిహెచ్‌సి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం యాదమరి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, డాక్టర్ జగదీష్‌ల ఆధ్వర్యంలో యాదమరి మెయిన్ రోడ్డులో విద్యార్థులు, పిహెచ్‌సి ఆరోగ్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో దోమల అంతం-మన పంతం అంటూ విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది రోడ్డపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు శుక్రవారం రోజు ఫ్రైడే డ్రైడే కార్యక్రమంను క్రమం తప్పకుండా నిర్వహించి దోమలు ఉత్పత్తి కాకుండా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. దోమలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటే ప్రజలు జ్వరాల బారిన పడకుండా వుండవచ్చునన్నారు. పగటి పూట మంచినీటిలో పెరిగే దోమలు కుట్టడం వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని, ఇది ప్రాణాంతకమైన జ్వరం అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కుమార్ వైద్య సిబ్బంది, విద్యార్థులతో పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ నిర్మలమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణిలు, సురేంద్రనాథరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పిలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, యాదమరి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## నేడు మామిడి రైతులు ఛలో చిత్తూరు

**చిత్తూరుహెల్త్, జులై 7 ప్రభాతవార్త:**
జిల్లాలోని మామిడి రైతులు కేంద్ర ప్రభుత్వం మామిడికి ప్రకటించిన కనీస మద్దతు ధర కేజీకి రూ.17.47 సాధించడానికి బుధవారం చిత్తూరు ఉమ్మడి జిల్లా మామిడి రైతు సంఘం ఆధ్వర్యంలో మామిడి రైతులు ఛలో చిత్తూరు కార్యక్రమం నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరంలో తోతాపురి మామిడి రకానికి ప్రకటించిన కనీస మద్దతు ధరను రైతుల నిర్లక్ష్యం కారణంతో సాధించలేకపోయామని, అయితే కేంద్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి మామిడికి ప్రకటించిన కనీస మద్దతు ధర కేజీకి రూ.17.47 సాధించుకోవడంతో పాటు ఈ మొత్తం మామిడి రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయి ప్రతి మామిడి రైతుకు న్యాయం జరిగే వరకు రైతులు శాంతియుత ఉద్యమానికి సిద్ధం కావాలని మామిడి రైతు సంఘ నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లాలోని మామిడి రైతులు బుధవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు గాంధీ విగ్రహం చేరుకుని శాంతియుత ధర్నాకు సిద్ధం కావాలని కోరారు.

## దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్



**కుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేయరాదని డిమాండ్ చేస్తూ మంగళవారం కుప్పంలో దస్తావేలు లేఖరులు పెన్‌డౌన్ నిర్వహించి దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ శాఖ సేవలు ప్రైవేటీకరణ చేయరాదన్నారు. అలాగే దస్తావేజు లేఖరుల లైసెన్సులు పునరుద్ధరించాలన్నారు. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటుతో తాము జీవనోపాధి కోల్పోతామన్నారు. అలాగే స్టాంప్ వెండర్లు, డిటిపి ఆపరేటర్లకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో కుప్పం దస్తావేజు లేఖరుల సంఘం నేతలు, దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు.

## కెఇసి విద్యార్థులచే ఘనంగా వనమహోత్సవం




**కుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ ఎన్ఎస్ఎస్ విభాగం అధ్వర్యంలో మున్సిపల్ పరిధి తంబిగానిపల్లి కొటాలు గ్రామంలో మంగళవారం ఘనంగా వనమహోత్సవంను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, మాజీ సరపంచ్ సురేష్‌కుమార్ హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ మొక్కల సంరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డాక్టర్ కోదండరామయ్య, కోఆర్డినేటర్లు గంగాధరన్, అరుణ్‌కుమార్, మాధవన్, డాక్టర్ శరవణ, హెచ్‌ఎం లలిత, రవీంద్ర, ఎస్‌ఎంసి ఛైర్మన్ సింగారవేలు, పిఆర్వో ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సత్వరం ఎన్యుమరేషన్ ఫారాలు అప్పగింత



**యాదమరి, జులై 7 ప్రభాతవార్త:**
ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ(సర్) ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లు బిఎల్‌ఓలకు సత్వరం తిరిగి అప్పగించాలని తహసిల్దారు పార్థసారధి కోరారు. ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమంను మంగళవారం తహసిల్దారు పార్థసారధి, పెంచల వీరేంద్రలు భూమిరెడ్డిపల్లి, పత్రపల్లి పంచాయతీల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ కార్యక్రమంను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దారు పార్థసారధి మాట్లాడుతూ యాదమరి మండల పరిధిలో మొత్తం 40,706 ఎన్యుమరేషన్ ఫారాలను ఓటర్లకు బిఎల్‌ఓలు ఇప్పటికే అందించడం జరిగిందన్నారు. మండల పరిధిలో 51 పోలింగ్ స్టేషన్లు వుండగా 51 మంది బిఎల్‌ఓలు విధులు నిర్వహిస్తున్నారని, అలాగే ప్రతి రాజకీయ పార్టీ తరపున ఒక బిఎల్‌ఎ వుంటారన్నారు. మండలంలో ఇప్పటి వరకు 29,693 ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తయ్యిందని, అంతే 73 శాతం డిజిటలైజేషన్ పూర్తయ్యిందన్నారు. మరో వారం రోజుల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తహసిల్దారు పార్థసారధి చెప్పారు.

## ఓటర్ల నమోదు వేగవంతం చేసుకోండి

రామిరెడ్డి ధ్వజరెడ్డి, తోట శివసాయి



**రైల్వేకోడూరు రూరల్, జులై 7 ప్రభాతవార్త**
రైల్వే కోడూరు మండలంలో ఉన్న ఓటర్లు తమ ఓటు నమోదు పత్రాలను వేగవంతంగా పూర్తి చేసి సంబంధిత బిఎల్‌ఓలకు అందజేయాలని రైల్వేకోడూరు వైసీపీ సీనియర్ నాయకులు మండల ఉపాధ్యక్షులు రామిరెడ్డి ధ్వజ రెడ్డి, ఉప సర్పంచ్ తోట శివ సాయిలు అన్నారు. మండలంలోని పగడాల పల్లి, 18వ వార్డు తదితర ప్రాంతాలలో మంగళవారం రామిరెడ్డి ధ్వజ రెడ్డి, తోట శివ సాయిలు ఎస్ఐఆర్ ప్రక్రియను సంబంధిత ఓటర్లతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లు వారి పేర్లు జాగ్రత్తగా ఉన్నాయా, లేదా అన్న కోణంలో తెలుసుకొని లేనివారు తమని సంప్రదిస్తే సంబంధిత అధికారుల వద్దకు తీసుకువెళ్లి నమోదు కార్యక్రమాన్ని చేపడతామని వారు ఓటర్లకు సూచించారు. ప్రస్తుత కాలంలో ఓట్లు ఎంతో అత్యంత కీలకమైనవని ఓటును వృధా చేయవద్దని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి ఈ నెల 14వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తిని రామిరెడ్డి ధ్వజ రెడ్డి, తోట శివ సాయిలు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులకు కౌరడి సిద్దయ్య, ఎంపీటీసీ రావుఫ్, భూంపల్లి నాగరాజా, చింతకాయలనరసింహులు,కుమార్,నాగేంద్రతదితరులు తోపాటు వైసీపీకి చెందిన కార్యకర్తలు పాల్గొన్నారు

## ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



**కుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను యువనేత ఎస్.హరీష్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక శ్రీతిరుపతి గంగమ్మ ఆలయంలో పూజలు చేసిన అనంతరం ఆయన కేక్ కట్ చేసి పేదలకు పంచారు. మందకృష్ణ మాదిగ నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో చంద్ర, రూపేష్, అరుణ్, గిరీష్, హరీష్, మురుగేష్, గణేష్, పురుషోత్తం పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ పారదర్శకంగా ఉండాలి

– ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**కుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు చేపడుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం పారదర్శకంగా ఉండాలని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దాసేగానూరు, కంగుంది సచివాలయాల్లో ఆయన సర్ ప్రక్రియ తీరును స్వయంగా పరిశీలించారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల మార్పులు, చేర్పులు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపుతదితర విధానాలపై బిఎల్‌ఓలు, బిఎల్‌ఎలతో చర్చించారు. ఎన్యుమరేషన్ ఫారాలు భర్తీ చేయలేని ప్రజలు సంబంధిత బూత్ లెవెల్ అధికారులను సంప్రదించి వారి ద్వారా భర్తీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ హైదర్ వలీ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్, సాధిక్ అలీ, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు



**శాంతిపురం, జూలై 7 ప్రభాతవార్త**
రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబునాయుడు అని యూనిట్ ఇన్‌చార్జ్ ఎల్.జయరాంరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కెనమాకులపల్లి పంచాయతీలో రైతులకు రాయితితో వేరుసెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన వారికి 221 పక్కాగృహాలు మంజూరయ్యాయని త్వరలోనే గృహ నిర్మాణ పత్రాలు అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నేతలు శివ, రాజు, శివశంకర్, రమేష్, చిట్టి, కార్యదర్శి స్వాతి పాల్గొన్నారు. అలాగే సొన్నేగానిపల్లి పంచాయతీలో సైతం వేరుసెనగ విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ బాలు, యూనిట్ ఇన్‌చార్జ్ మునేగౌడ, మాజీ సర్పంచ్ మంజునాథరెడ్డి, శివానంద, అనసూయ, వేదశ్రీ, భాస్కర్, కృష్ణమూర్తి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి

– రేణిగుంట డి.ఎస్.పీ. శ్రీనివాసరావు



**రైల్వేకోడూరు అర్బన్, జులై 7 ప్రభాతవార్త.**
ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, రోడ్డు ప్రమాదాల నివారణలో ఆటో డ్రైవర్ల పాత్ర అత్యంత కీలకమని రేణిగుంట డి.ఎస్.పీ. వై. శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు ఎల్లప్పుడూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వంటి చర్యలు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. రోడ్డు కూడళ్లు, పాఠశాలలు, ఆసుపత్రులు మరియు జనసమ్మర్థం ఉన్న ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా వాహనాలు నడపాలని కోరారు. ఈ సూచనలు సాధారణ రోడ్డు భద్రతా మార్గదర్శకాలతో అనుగుణంగా ఉన్నాయి. ప్రతి ఆటోలో చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ (శిగీది) ధ్రువపత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. వాహనం బ్రేకులు, లైట్లు, ఇండికేటర్లు మరియు టైర్లను తరచూ తనిఖీ చేసి రోడ్డు యోగ్యంగా ఉంచాలని సూచించారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్కు లేదా డయల్112కు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఆటో డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా అనేక ప్రాణాలను కాపాడవచ్చని డి.ఎస్.పీ. శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## రైతులకు చాప్ కట్టర్లు పంపిణీ



**రామకుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
మండలంలో 21మంది రైతులకు పశు సంవర్థక శాఖ అధ్వర్యంలో రాయితీతో చాప్ కట్టర్లను నేతలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమంకు సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, జిల్లా నేత పట్ర నారాయణ, మండల అధ్యక్షుడు వెంకటరమణ, నేతలు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, కామరాజునాయక్, సీతాపతి, కృష్ణనాయక్, విశ్వనాథ్, రవిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి,హరీష్, ఆదిల్, సత్తి, హరి, మనోహర్, గజేంద్ర, లోకేష్, బాబు, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## పాడి రైతులకు అండగా సిఎం చంద్రబాబు

– టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్



**కుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
కుప్పం ప్రాంతంలోని పాడి రైతులకు సిఎం చంద్రబాబునాయుడు అండగా నిలుస్తున్నారని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పైపాళ్యం పంచాయతీలో రైతులకు ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న పశుదాణాను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఐదు లక్షల లీటర్లు ఉన్న పాలదిగుబడి పది లక్షల లీటర్లకు పెంచడమే ధ్యేయంగా సిఎం చంద్రబాబు చర్యలు చేపట్టారన్నారు. పాడి రైతులకు అనుకూలంగా కుప్పం ప్రాంతంలో డెయిరీ పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకువచ్చారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, కో క్లస్టర్ ఇన్‌చార్జ్ వేడి, యూనిట్ ఇన్‌చార్జ్ వల్లెప్ప, పార్టీ అధ్యక్షుడు గోవిందస్వామి, డాక్టర్ ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక దినోత్సవం



**కుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక దినం, ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను కుప్పం, రామకుప్పం,మల్లానూరులో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఎంఆర్‌పిఎస్ నేతలు ఘన నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. మల్లానూరు అన్నక్యాంటీన్‌లో ఉదయం, మధ్యాహ్నం పేదలకు అన్నదానం జరిపారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ కో ఇన్‌చార్జ్ వెంకటేష్, గౌరవాధ్యక్షుడు పాపన్న, జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రకాష్, నేతలు గోవిందప్ప, జమప్ప, విజయ్‌కుమార్, రియాజ్, నాసిర్, సుబ్రమణ్యం, రాము, రాజేంద్ర, మురుగేష్, సంపంగి పాల్గొన్నారు.

## సర్ కార్యక్రమం వేగవంతం చేయాలి



**రామకుప్పం, జూలై 7 ప్రభాతవార్త**
మండలంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమంను వేగవంతం చేయాలని తహశీల్దార్ కౌలేష్ ఆదేశించారు. రామకుప్పం మండలంలో ఇప్పటివరకే 62శాతం మాత్రమే వివరాలు డిజిటలైజేషన్ అయిందన్నారు. త్వరగా ఈకార్యక్రమం పూర్తి చేయాలని బిఎల్‌ఒలను ఆదేశించారు. ప్రజలు, బిఎల్‌ఎలు, రాజకీయ పార్టీలు సహకరించి త్వరగా పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.

## క్షయవ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ

**బైరెడ్డిపల్లి, జూలై 7 ప్రభాతవార్త**




స్థానిక పిహెచ్‌సి కేంద్రంలో దివంగత రమణ జ్ఞాపకార్థం పౌష్టికాహార కిట్లను శాంతి క్లినిక్ నిర్వాహకులు ప్రియాంక, మహతి ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాసులు అధ్వర్యంలో పంపిణీ చేశారు. నెలరోజులకు సరిపడా డ్రై ఫ్రూట్స్, ప్రోటీన్ పౌడర్లు, విటమిన్ సిరప్‌లు, ఇతర మందులు పంపిణీ చేశారు. పిహెచ్‌సి డాక్టర్ విజయచందర్ మాట్లాడుతూ క్షయవ్యాధి గ్రస్తులకు దాతలు సహకారం అందించడం పట్ల వారిని అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ షాలిని, సిహెచ్‌ఓ జయంతి,సూపర్‌వైజర్ సారామతి, జిలానీ పాల్గొన్నారు.

8 -7Pg9th cheli:8 -7Pg9th cheli.qxd 7/7/2026 11:32 PM Page 1



# అందానికి ఇంటి చికిత్స



అందానికి ఇంటి చికిత్సలూ ఒకటి. ఎన్ని రకాల క్రీములున్నా.. సహజమైనవి చేసే మేలే ఎక్కువ మరి. మీరూ ఆ ప్రయోజనం పొందాలి అనుకుంటున్నారా? అయితే వీటిని ప్రయత్నించేయండి.

**బేకింగ్ సోడా**–యాపిల్ సిడార్ వెనిగర్.. చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించడంలో వంట సోడా బాగా పని చేస్తుంది. చెంచా వంటసోడాలో రెండు చెంచాల యాపిల్ సిడార్ వెనిగర్ చేర్చి, పేస్టులా చేసుకోవాలి. ముకాన్ని కడిగి, తడి లేకుండా తుడిచాక ఈ మిశ్రమాన్ని పట్టించాలి. పది నిమిషాల తర్వాత గాఢత తక్కువ ఉండే ఫేస్వాష్‌తో కడిగేస్తే సరి. మెరిసే చర్మం మీ సొంతం.

**నిమ్మ..** చర్మాన్ని మెరిపించడంలో నిమ్మదీ ప్రత్యేక పాత్రే. దీనిలోని విటమిన్ సి సహజ అందం కోసం పని చేస్తుంది. ఒక నిమ్మచెక్కను సన్నటి చక్కెరలో ముంచి ముఖంపై మృదువుగా మర్దనా చేస్తే చాలు. అయిదు నిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మరంధ్రాలను లోతుగా శుభ్రం చేసి, చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలుఅలర్జీలు, యాక్నే రాకుండానూ చూస్తుంది.

**నారింజ తొక్కలతో..** చెంచా నారింజ తొక్కల పొడికి, చెంచా తేనె, చిటికెడు పసుపు కలిపి మెత్తని చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసి, మాయిశ్చరైజర్‌ను రాస్తే సరి. దీనిలో ఉండే సి విటమిన్ ముఖంపై ముడతలు, గీతలను తగ్గించ కలదు.

**అరటి-తేనె..** బాగా పండిన అరటి పండులో చిన్న ముక్క తీసుకొని గుజ్జులా చేయాలి. దానికి చెంచా తేనె, నాలుగైదు చుక్కలు నిమ్మరసం కలిపి, మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. దీన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి, పావుగంటసేపు వదిలేయాలి. ఆపై గోరువెచ్చని నీటితో కడిగేస్తే సరి. అరటిలోపుష్కలంగా ఉండే ఎ,బి,ఇ విటమిన్లు చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు.. నల్ల మచ్చలనీ తగ్గిస్తాయి. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తేమగా ఉంచుతాయి. □

### చిట్కా

- బెండ కాయ కూర కరకరలాడు తుండా లంటే ముందు రోజు రాత్రి బెండకాయలను తరిగివుంచుకొని మర్నాడు కూర చేయండి.
- పప్పుధాన్యాలు నిలువవుంచిన పాత్రలక్రింద తాజా వేపాకులు వేస్తే పురుగులు రావు.

# హేమమాలిని 'డ్రీమ్ గాళ్'గా మారిన వేళ !



భారతీయ సినీ చరిత్రలో హేమమాలినిని 'డ్రీమ్ గాళ్' పేరు చిరస్థాయిగా నిల బెట్టింది. బాలీవుడ్ ఎవర్ గ్రీన్ బ్యూటీ, ప్రముఖ నటి, రాజకీయ నాయకురాలు హేమమాలినిని అభి మానులు 'డ్రీమ్ గాళ్'గా ఆరాధిస్తుంటారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు కనీసం 4 దశాబ్దలకు పై ఆమెకా బిరుదు సార్ధకత సాధించి పెట్టింది. ఈ బిరుదు వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను ఆమె 'ది కపిల్ శర్మ షో'లో పంచుకున్నారు. 'డ్రీమ్ గాళ్' సినిమాలో నటించకముందే ఆమెకా పేరు వచ్చేసింది. అదీ కాకతాళీ యంగా తనకే తెలియకుండా తెరంగ్రేటం నాడే డ్రీమ్ గరల్‌గా పరిచయం చేయబడింది. హేమమాలిని హిందీలో అడుగుపెట్టిన తొలి చిత్రం 'సప్నో కా సౌదాగర్' (1968). ఈ సినిమా నిర్మాత బి. అనంతస్వామి ఓ అద్భుతమైన ప్రచార వ్యూహంలో భాగంగా సినిమా విడుదల కాక ముందు, హీరోయిన్ ఎవరో చెప్పకుండా "డ్రీమ్ గాళ్ వస్తోంది' అంటూ ముంబై అంతటా పోస్టర్లు వేయించారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనం .. ఉత్కంఠ రేపాకనే ప్రేక్షకుల ముందుకు వస్తున్న 'డ్రీమ్ గాళ్' హేమామాలిని అని ప్రేక్షకుల చెవికి వినబడడంతో నాడు కేరింతలు కొట్టారు. ఆనాటి నుంచి ఈ నాటి వరకు 'డ్రీమ్ గాళ్' పేరు వినిపిస్తే చాలు అక్కడ హైమామాలిని ఉన్నట్లే యువత స్మృతి పథంలో ఆమె నాలట్యం చేస్తునేట్లే ఉంటుంది. హైమామాలిని అంటూ యువత ఎగిరి గంతేసే వారు. ఇప్పుడికి అంతే. ఈ విషయంపై హేమమాలిని మాట్లాడుతూ.. 'నా తొలి సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. కానీ, పోస్టర్ల మీద ఎక్కడా తన పేరు కాకుండా 'డ్రీమ్ గాళ్, డ్రీమ్‌గాళ్' అనే కనిపిస్తోంది. ప్రేక్షుకుల నుంచి ఒకటే స్పందన ఎవరేం చేస్తున్నారో అర్థం కాక నేను కాస్త ఆందోళన చెందాను. అప్పుడు నిర్మాత అనంతస్వామి నాతో, నీ పేరును మేం ఇలాగే పరిచయం చేయబోతున్నాం. ఆ డ్రీమ్ గాళ్ ఎవరో కాదు, నువ్వే! నన్నారు తామే ప్రకటిస్తాం అంత వరకూ సస్పెన్సే! అలా అనంతస్వామి ఆలోచన అద్భుతంగా ఫలించింది. ఆ పేరు నాకు శాశ్వతంగా నిలిచిపోయింది అని వివరించారు. మహేశ్ కౌల్ దర్శకత్వం వహించిన 'సప్నో కా సౌదాగర్' చిత్రంలో రాజ్ కపూర్, హేమ మాలిని, తనూజ, నదీరా ప్రధాన పాత్రలు పోషించారు. 'డ్రీమ్‌గాళ్'గా సినీప్రేక్షకుల హృదయాల్లో బందీ అయిన దాదాపు దశాబ్దం తర్వాత, 1977లో హేమమాలి నటించిన 'డ్రీమ్ గాళ్' పేరుతో వచ్చిన మరో సినిమాలో ప్రధాన పాత్రలో నటించారు. ప్రమోద్ చక్రవర్తి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అశోక్ కుమార్, ధర్మేంద్ర, ప్రేమ్ చోప్రా వంటి అగ్ర తారలు ఉన్నారు. ఈ సినిమాలో హేమమాలిని అనాథ పిల్లల ఆశ్రమాన్ని నడపడం కోసం డబ్బు సంపాదించ డానికి సప్న, పద్మ, చంపాబాయి, డ్రీమ్ గాళ్, రాజ్ కుమారి అనే ఐదు విభిన్న పాత్రలలో కనిపిస్తారు. లక్ష్మీ కాంత్‌ప్యారేలాల్ స్వరపరిచిన ఈ చిత్రంలోని "డ్రీమ్ గాళ్" టైటిల్ సాంగ్

దేవాలయాల్లో దైవ దర్శనం అనంతరం పూజారి భక్తుల తలపై ఉంచే లోహ కిరీటం వంటి పరికరాన్ని శఠగోపం లేదా శఠారి అంటారు. దీనిపై భగవంతుడి పాద ముద్రలు ఉంటాయి. ఆధ్యాత్మికంగా శఠారిని తలపై ఉంచుకోవడం అంటే దైవ పాదాలను మన శిరస్సుపై ధరించడమే. మనలోని అహంకారాన్ని (శఠం) పోగొట్టి,

# శఠగోపం..

వినయాన్ని ప్రసాదించేది కాబట్టి దీనికి 'శఠారి' అనే పేరు వచ్చింది. దీనిని స్వీకరించే సమయంలో భక్తులు వంటి నమస్కరించడం ద్వారా తమ సర్వస్వాన్ని దైవానికి సమర్పించుకున్నట్టు అవుతుంది. శఠగోపాన్ని రాగి లేదా వెండి వంటి లోహాలతో తయారుచేస్తారు. గర్భాలయంలోని విగ్రహం సమీపంలో ఉండటం వల్ల ఈ లోహపు శఠారి దైవశక్తిని, మంత్రోచ్చారణల వల్ల కలిగే ప్రకంపనలను నిక్షిప్తం చేసుకుంది. దీనిని తలపై ఉంచినప్పుడు, ఆ దివ్యశక్తి భక్తుల శిరస్సులోని 'సహస్రార చక్రం' ద్వారా శరీర మంతటా ప్రసరించి మనసును ప్రశాంతంగా మారుస్తుంది. అని వేదపండితులు తెలియ జేశారు. శఠగోపం వల్ల మానసిక ఆందోళనలు తొలగి, ఆత్మ విశ్వాసం పెరుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఆలయ దర్శనంలో శఠారి ఆశీర్వచనం అత్యంత పవిత్రమైన ఘట్టం. □

# పాపలకు తాజా పాలు



పిల్లల పోషణ.. పాలతో పరిపూర్ణ మవుతుంది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో తాజా పాలు దొరకడం కొంచెం కష్టమే.దాంతో చాలామంది..ముఖ్యంగా పట్టణాలూ, నగరాల్లోని వాళ్లు ప్యాకెట్ పాలను వాడటానికే మొగ్గు చూపుతుంటారు. అయితే వీటి ఎంపికలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా అనారోగ్యాలు తప్పవు. . పేపర్‌బోర్డు లేదా టెట్రా ప్యాకింగుతో తయారైన పాల డబ్బాల్లో బ్యాక్టీరియా శాతం అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. కారణాలను అన్వేషిస్తే.. పాలను శుద్ధిచేసిన తరవాత వాటిని డబ్బాల్లో నింపడానికి వినియోగించే మెషిన్లే ఇందుకు కారణమని తేల్చారు. ఇందులో భాగంగా మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్లలో పాల శాంపిళ్లను తీసుకుని పరీక్షించారు. వారం తరవాత వాటిల్లోని పాలు 30 శాతం పాడైతే, రెండు వారాలకల్లా 41 శాతం పాడైనట్లు గుర్తించారు. అంతే కాదు రుచిలోనూ తేడాను గమనించారట. మరో విష యం ఏంటంటే.. పెద్ద కంటైనర్లలోని పాలకంటే చిన్న కంటైనర్లలోని పాలు త్వరగా పాడవుతు న్నాయనీ చెబుతున్నారు. యంత్రాల వాడకం పెరగడం, వాటిని శుభ్రం చేయడం క్లిష్టతరంగా ఉండటమే ఈ పరిస్థితికి దారితీస్తోంది. ఈ మెషిన్లను మరింత శ్రద్ధతో శుభ్రం చేయాలనీ, అవసరమైతే వాటి డిజైన్‌లోనూ మార్పులు చేయాలని ఆయా సంస్థకు సూచిస్తున్నారు పరిశోధ కులు. వినియోగదారులు ఈ టెట్రా ప్యాకెట్లనూ, పేపర్‌బోర్డు కంటైనర్లనూ వినియోగించడంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటు న్నారు. ముఖ్యంగా గర్భిణులూ, పిల్లలూ వీటిని వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండాలట. □

# నోరూరే నేరేడు !



నల్లగా నిగనిగలాడే నేరేడు పండును చూస్తేనే నోరూరిపోతుంది. కండ తక్కువ, గింజ పెద్దది కనుక ఎన్ని తిన్నా తిన్నట్టే ఉండదు. ఇవి రుచిలోనే కాదు, ఆరోగ్యం అందించడంలోనూ ముందుంటాయి. వీటితో ఎన్ని లాభాలున్నాయంటే. నేరేడుపండ్లు తినటం వల్ల శరీరానికి అవసంమైన క్యాల్షియం, ఐరన్, మెగ్నీషియం, భాస్వరం, పొటాషియం, సోడియం, సల్ఫర్, థియామిన్, రిబోఫ్లేవిన్, ఫోలిక్ యాసిడ్, ఎ,బి1, బి2, బి3, బి5, బి6, సి-విటమిన్లు అందుతాయి. రక్తపోటును తగ్గిస్తాయి, కొలెస్ట్రాల్ స్థాయిని నియంత్రిస్తాయి. గుండెకు మేలు చేస్తాయి. బరువు తగ్గటంలో తోడ్పడతాయి. కీళ్లనొప్పులను నివారిస్తాయి. కంటిచూపును మెరుగుపరుస్తాయి. గొంతులో వచ్చే సమస్యలను నివారిస్తాయి. జుట్టు రాలదు. కుదుళ్లు దృఢంగా ఉంటాయి. శరీరంలో చేరిన మలినాలను హరింప చేస్తాయి. కాలేయాన్ని సంరక్షిస్తాయి. మూత్రపిండాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. చర్మం కాంతితో మెరిసేలా చేస్తాయి. మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జీర్ణ ప్రక్రియ సాఫీగా ఉంటుంది. రక్త హీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వర ప్రయోజనం ఉంటుంది. రక్తహీనతతో బాధపడుతున్న వారు వీటిని తీసుకోవటం వల్ల సత్వరప్రయోజనం ఉంటుంది. □

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చాలంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు,ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం.

ఈ మెయిల్: Cheli@vaartha.com

# తార

## VenkyAnil5 ( NkrAR2)- షూటింగ్‌లో వెంకటేష్



విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అనిల్ రావిపూడి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న VenkyAnil5 ( NkrAR2)- చిత్రం కోసం జతకట్టారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. కల్యాణ్ రామ్ పుట్టినరోజున విడుదలైన ఆయన ఫస్ట్‌లుక్ పోస్టర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. కల్యాణ్ రామ్, ఇతర నటీనటులపై చిత్రీకరించిన ఒక పాట షూటింగ్‌ను చిత్ర బృందం ఇటీవల పూర్తి చేసింది. ఈ సినిమా మొదటి షెడ్యూల్‌లో కీర్తి సురేష్, కృతి శెట్టి కూడా పాల్గొంటున్నారు. తాజాగా విక్టరీ వెంకటేష్ షూటింగ్ సెట్‌లో చేరారు. ప్రస్తుతం ప్రధాన తారాగణంతో కూడిన కీలక సన్నివేశాలను భారీ సెట్‌లో చిత్రీకరి స్తున్నారు. వెంకటేష్, కీర్తి సురేష్, కృతి శెట్టిలతో కలిసి కల్యాణ్ రామ్ కూడా ఈ సన్నివేశాల్లో పాల్గొంటున్నారు. వెంకటేష్, కల్యాణ్ రామ్ మధ్య వచ్చే సన్నివేశాలు ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. వీరిద్దరి ఆకట్టుకునే ఆన్‌స్క్రీన్ అనుబంధం, అనిల్ రావిపూడి మార్కు వినోదానికి చక్కగా సరిపోతుంది.ఈ చిత్రంలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్ కథా నాయికగా నటిస్తుండగా, కల్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తోంది. ఈ చిత్రానికి బలమైన సాంకేతిక బృందం పని చేస్తున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం సమకూరుస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటింగ్, ఎ.ఎస్. ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరి స్తున్నారు. ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్. VenkyAnil5 ( NkrAR2)- అనిల్ రావిపూడి మార్క్ వినోదం, కుటుంబ భావోద్వేగాలు, ఫెస్టివల్ ట్రేడ్‌మార్క్ ఎంటర్టైనర్. ఈ చిత్రం 2027 సంక్రాంతికి అత్యంత ఎదురుచూస్తున్న చిత్రంగా నిలుస్తోంది.

## 'రాజా ది రాజా' : ట్రైలర్ లాంచ్



ఈవెంట్‌లో నిర్మాత రవిశంకర్ రుత్విక్, విశాఖ ధిమాన్ 'రాజా ది రాజా' అద్భుతమైన థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా నటించిన 'రాజా ది రాజా' చిత్రం థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. అనిల్ బోయిడపు దర్శకత్వంలో రూపొందిన ఈ పీరియాడిక్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్, ప్రేమ, వినోదం, యూత్‌కు సంబంధించిన భావోద్వేగాల కలయికతో ఆకట్టుకోనుంది. తొలి సినిమానే అయినప్పటికీ రుత్విక్ రెండు భిన్నమైన పాత్రల్లో ఎంతో మెచ్యూర్డ్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ.. 'రాజా ది రాజా' ఈ మధ్యకాలంలో ఎక్కువగా వినిపిస్తున్న పేరు. ఈ సినిమా హీరో రుత్విక్‌తో పాటు నిర్మాత నిహారిక కూడా చాలా ప్యాషన్ ఉన్న నిర్మాత. ఇందులో పాటలు చూస్తుంటే అద్భుతంగా ఉన్నాయి. హీరో రుత్విక్ మాట్లాడుతూ.. 'రాజా ది రాజా' సినిమా ద్వారా నేను నటుడిగా తెలుగు ప్రేక్షకులకు పరిచయం కాబోతున్నాను. ఈ జర్నీ చాలా ఎమోషనల్. అనిల్‌తో కలిసి సినిమా చేయడం చాలా అద్భుతమైన అనుభూతి. ప్రేక్షకులను అలరించేలా ప్రతి సన్నివేశాన్ని తెరకెక్కించడానికి మేమంతా చాలా కష్టపడ్డాం. నిర్మాత నిహారిక దాసరి మాట్లాడుతూ.. రవికి, నవీన్‌కి హృదయ పూర్వక ధన్యవాదాలు. వారు ఈ సినిమా రిలీజ్ చేయడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ.. టీజర్ వచ్చినప్పటి నుంచి సినిమాకి చాలా మంచి పేరు వస్తోంది. పాటలకు కూడా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ప్రేక్షకుల స్పందన చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మా చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా రిలీజ్ చేస్తున్నందుకు రవికి, నవీన్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు.

## #ChiruBobby2 / #Chiru158 యాక్షన్ షెడ్యూల్



'వాల్తేరు వీరయ్య' భారీ విజయం తర్వాత మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి మళ్లీ కలిసి పనిచేస్తున్న చిత్రం #ChiruBobby2 / #Chiru158 KVN ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె. నారాయణ నిర్మిస్తున్న ఈ భారీ బడ్జెట్ ఎంటర్‌టైనర్ షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో విస్తృతంగా జరుగుతోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్లు రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్న భారీ యాక్షన్ సన్నివేశం ఈ చిత్రంలో మేజర్ హైలెట్స్‌లో ఒకటి. భారీ సంఖ్యలో ఫైటర్లతో అత్యంత భారీ స్థాయిలో రూపొందు తున్న ఈ సన్నివేశం, మెగాస్టార్ చిరంజీవిని పవర్ ఫుల్ , డైనమిక్ అవతార్‌లో ప్రజెంట్ చేయనుంది. అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందించేలా రూపొందు తున్న ఈ యాక్షన్ ఘట్టంలో, మెగాస్టార్ స్వయంగా పాల్గొంటూ చాలా సాహసోపేతమైన స్టంట్స్ చేస్తున్నారు. అభిమానులు, ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రానికి సంబం ధించిన టైటిల్ టీజర్‌ను విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నద్ధమవుతోంది. ఈ చిత్రానికి అద్భుతమైన సాంకేతిక బృందం పని చేస్తోంది. థమన్ ఎస్ సంగీతం సమకూరుస్తుండగా, ప్రఖ్యాత సినిమా టోగ్రాఫర్ విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్ అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్‌ను అవినాష్ కొల్లా నిర్వహిస్తుండగా, ఎడిటింగ్ ఆంటోనీ రూబెన్. కోన వెంకట్, కె.చక్రవర్తి రెడ్డి స్క్రీన్‌ప్లే అందించగా, హరి మోహన కృష్ణ, వినీత్ పోట్లూరి అడిషనల్ స్క్రీన్‌ప్లేను సమకూర్చారు. స్టార్ రచయితల ద్వయం భానునందు సంభాషణలు రాస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న చిత్రాలలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది.

## 'రోమాంచకం' గ్లింప్స్ రిలీజ్



సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న మూవీ భద్రకాళీ పిక్చర్స్, డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబోలో భారీ పాన్ ఇండియా బ్లాక్ బస్టర్స్ వచ్చాయి. ఈ కాంబోలో ఒక యంగ్ టీమ్ తో ఫ్రెష్ లవ్ స్టోరీ మూవీ వస్తోం దంటే ప్రేక్షకులు కొత్తదనం ఆశిస్తారు, స్ట్రాంగ్ కంటెంట్ ఎక్స్ పెక్ట్ చేస్తారు. ప్రేక్షకులు కోరుకునే అలాంటి కొత్తదనంతో యూనిక్ లవ్ స్టోరీగా తెరకెక్కుతోంది 'రోమాంచకం' సినిమా. సుమంత్ ప్రభాస్, అనంతిక సనిల్ కుమార్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని సందీప్ రెడ్డి వంగా సమర్పి స్తుండగా, ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొంది స్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన 'రోమాంచకం' సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేసి మంచి రెస్పాన్స్ తెచ్చుకుంది. ఈ సినిమా సెప్టెంబర్ 3న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.ఈ రోజు "రోమాంచకం" సినిమా గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ డీవోపీ పవన్ పప్పుల అందించిన పెయింటింగ్ లాంటి బ్యూటిఫుల్ విజువల్స్ తో , వాసుకి వైభవ్ కంపోజ్ చేసిన స్వీట్ మెలోడియస్ ట్యూన్ తో సాగుతూ హీరోయిన్స్ మధ్య ఉన్న ప్రేమను, వారి మధ్య ఏర్పడిన దూరాన్ని చూపిస్తూ సాగింది. ఖిఅణువు అణువును ఉర్రూతలూపే ప్రణయ కల్లోలమే రోమాంచకం, ఊహకే అందని ఉవ్వెత్తునెగిసే ఉత్తుంగ తరంగమే రోమాంచకం.. అంటూ గ్లింప్స్ లో వచ్చిన లిరిక్స్ ఈ మూవీ ఎంత వైబ్రేటింగ్ గా ఉండబోతుందో తెలియజేస్తోంది. "రోమాంచకం" సినిమా ప్రేమ, హాస్యం, ఉత్కంఠ కలగలిపి ప్రేక్షకుల్ని ఉర్రూతలూగించేందుకు వస్తోంది. సుమంత్ ప్రభాస్, అనంతిక జంట కెమిస్ట్రీ ఈ సినిమాకు హైలైట్‌గా నిలుస్తోంది.

## 'లవ్ ఓ లవ్' ప్రీరిలీజ్ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్



లవ్ ఓ లవ్ ప్రీరిలీజ్ వేడుక నేడు హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. చిత్ర బృందం, సినీ ప్రముఖులు, మీడియా ప్రతినిధులు, అభిమానుల సమక్షంలో నిర్వహించిన ఈ వేడుక ఎంతో సందడిగా సాగింది. పావిష్ నారాయ ణన్, నాగ దుర్గా జంటగా నటించిన ఈ చిత్రానికి మాగేశ్ రాజేంద్రన్ దర్శకత్వం వహించారు. రొమాన్స్, కామెడీ, భావోద్వేగాల సమ్మేళనంగా రూపొందిన ఈ చిత్రంపై ఇప్పటికే ప్రేక్షకుల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన మాస్ కా దాస్ విశ్వక్ సేన్ చిత్ర బృందానికి తన హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ నిర్మాతలు సి. కళ్యాణ్, దామోదర్ ప్రసాద్, జి. నాగేశ్వర రెడ్డి కూడా హాజరై చిత్ర బృందానికి తమ శుభాకాం క్షలు తెలియజేశారు. లవ్ ఓ లవ్ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఘన విజయం సాధించాలని ఆకాంక్షి స్తూ, చిత్ర యూనిట్‌కు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం ప్రీ రిలీజ్ ఈవెంట్ వేడుకలో మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. ఈరోజు ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా మీడియా మిత్రులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. పవిష్ ప్రత్యేకంగా ఈ కార్యక్రమానికి రావాలని నన్ను ఆహ్వానించాడు. నేను ప్రస్తుతం ఏ నగరానికి ఏమైంది 2 సినిమా షూటింగ్‌లో ఉన్నాను. ఈరోజు పవిష్ సినిమా ఈవెంట్‌కు వెళ్లాల్సి ఉందని తరుణ్ భాస్కర్‌కు చెప్పగా, ఆయన కూడా రెండు గంటల ముందే షూటింగ్ నుంచి వెళ్లమని ప్రోత్సహించారు. నిర్మాత జి. ధనంజేయన్ మాట్లాడుతూ.. విశ్వక్ సర్‌కు నేను పెద్ద

## 'లెనిన్' వాయిస్ ఓవర్ ఇచ్చిన ఎన్టీఆర్



'లెనిన్' చిత్రానికి పవర్ ఫుల్ వాయిస్ ఓవర్ ఇచ్చిన మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్.. అఖిల్ అక్కినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మనం ఎంటర్‌ప్రైజెస్ ఎల్‌ఎల్‌పి, సితార ఎంటర్ టైన్‌మెంట్స్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన చిత్రం 'లెనిన్'. ఈ సినిమాకి మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. ఈ మూవీ జూలై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన కంటెంట్ ఆడియెన్స్‌లో అంచనాల్ని పెంచేసింది. ఇక ట్రైలర్‌కి నాగార్జున ఇచ్చిన వాయిస్ ఓవర్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచింది. తాజాగా చిత్రయూనిట్ మరో సర్ ప్రైజ్‌తో అభిమానుల్లో అంచనాల్ని మరింతగా పెంచింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ 'లెనిన్' కోసం వాయిస్ ఓవర్ ఇచ్చారు. సినిమా కథను, నేపథ్యాన్ని, శ్రీరామపురం గురించి ఎన్టీఆర్ తన గంభీరమైన గాత్రంతో ప్రేక్షకులకు పరిచయం చేయనున్నారు. ఇక థియేటర్లో ఎన్టీఆర్ వాయిస్ ఓవర్‌కి, ఆయన ఇచ్చే ఎలివేషన్స్‌కి బాక్సులు బద్దలయ్యేలా ఉంది. ఎన్టీఆర్ ఇచ్చే ఈ వాయిస్ ఓవర్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని భావిస్తున్నారు. ఎన్టీఆర్‌కి నాగార్జునతో, అక్కినేని కుటుంబంతో ఎంతో అనుబంధం ఉంది. అందుకే అఖిల్ కోసం ఎన్టీఆర్ ఇలా వాయిస్ ఓవర్ ఇచ్చి 'లెనిన్'కి తన వంతుగా సపోర్ట్ చేశారు.ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, పాటలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అఖిల్ రగ్డ్ రా అండ్ రస్టిక్ లుక్ ఇప్పటికే అభిమానుల్ని ఆకట్టుకుంది. ఈ చిత్రానికి తమన్ సంగీతం, నేపథ్య సంగీతం, లియోన్ బ్రిట్టో కెమెరావర్క్ హైలెట్‌గా నిలుస్తుందని అంతా భావిస్తున్నారు. ఈ మూవీకి నవీన్ నూలి ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.ఈ చిత్రం 2026 జూలై 10న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

# తిరుపతి డివిజన్

## సీఎం సభ సక్సెస్‌పై హర్షం

### కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం, బిజెపి సీనియర్ నాయకులు గల్లా శ్రీధర్

ఓబులవారిపల్లి, జూలై 7 ప్రభాతవార్త



రైల్వే కోడూరు నియోజకవర్గం ముక్కవారిపల్లి. రెవిన్యూ విలేజ్‌లో విబిజి రాంజీ గ్రామీణ పథకాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం ఎంతో గర్వించదగ్గ విషయమని బిజెపి సీనియర్ నాయకులు. అన్నమయ్య జిల్లా మాజీ ఎం ఎస్ ఎం ఈ, ప్యాప్సియా ఎమ్మెస్ ఏం జిల్లా కోఆర్డినేటర్ గల్లా శ్రీధర్ అన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు హాజరైన ఈ మహాసభ విజయవంతమైనందుకు హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన ఈ రాంజీ వి బి జి గ్రామీణ పథకాన్ని మన రైల్వే కోడూరు ప్రాంతంలో ప్రారంభించడం దేశంలోనే ఇదో మహోన్నతమైన ఘట్టమని, ఈ సువర్ణ అవకాశాన్ని ఆంధ్ర ప్రజలు అందుపుచ్చుకొని దేశంలోని ముఖ్యవారిపల్లెకు, ఓబులవారిపల్లి మండలానికి ఒక దిక్సూచిగా గొప్ప పేరు ప్రఖ్యాతలు రావడం వెనుక సభను సక్సెస్ చేసిన టిడిపి ఇన్చార్జి కూడా చైర్మన్ ముక్కారూపానందరెడ్డికి ధన్యవాదములు తెలుపుతున్నామన్నారు. బిజెపి హయంలో భారతదేశం అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతుందన్నారు.

## ఉపాధి పని అడిగితే .. మేట్‌గా తొలగించారు

### దళిత నియోజకవర్గంలో దళితులకే అన్యాయం, పట్టించుకోని ప్రజా ప్రతినిధులు



పెనగలూరు, జూలై 7 ప్రభాతవార్త

రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఉపాధి పనులు కల్పించాలని చెబుతుంటే పెనగలూరు మండలంలో మాత్రం ఉపాధి పనులు కల్పించాలి అంటే రాజకీయ బలం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దళిత నియోజక వర్గంలో దళితులకు అన్యాయం జరుతున్నా ప్రజా ప్రతినిధులు పట్టించుకునే పరిస్థితి లేక పోవడం విశేషం. తమకు రెండు వారాలుగా ఉపాధి పనులు పెట్టడం లేదని పనులు కల్పించాలని తిరుణంపల్లి దళితవాడ ప్రజలు ఈ నెల 6న సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పెనగలూరు తహశీల్దార్‌కు కమలాకర్, ఉపాధి కూలీలు అర్జీ ఇవ్వడం జరిగినది. ఉపాధి పనులు పెట్టాలని అర్జీ పెట్టుకున్న కమలాకర్‌ను వెంటనే మేట్‌గా తొలగించి తిరుణంపల్లి దళితవాడకు ఉపాధి హామీ పథకం పనులు పెట్టె ప్రసక్తే లేదని ఉపాధి అధికారులు చెబుతున్నారు. కేవలం దళితులపైనే ఉపాధి అధికారులు ఎందుకు కక్షయ పెంచుకుని ఇబ్బందులకు గురి చేస్తున్నారో అర్థం కావడం లేదని బాధితులు వాపోతున్నారు. ఉపాధి పనుల పైన కూడా అగ్ర వర్ణాల వారి పెత్తనంతో దళితులకు పనులు లేకుండా పోతున్నాయని బాధిత ప్రజలు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి వెంటనే ఉపాధి పనులు తిరుణంపల్లి దళితవాడ ప్రజలకు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని బాధిత ఉపాధి కూలీలు కోరుతున్నారు.

## దళితుల భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలి

### సిపిఐ నాయకులు

ఓబులవారిపల్లి, జూలై 7 ప్రభాతవార్త



ఓబులవారిపల్లి మండలంలోని వై కోట గ్రామ రెవెన్యూ పొలం 1066 సర్వే నెంబర్లు దాదాపు 524 ఎకరాలు ఉండగా మొత్తం భూ కబ్జాదారుల ఆక్రమంలో ఉండి 30 ఎకరాలు మాత్రం దళితులు గత 20 సంవత్సరాలుగా భూములను అనుభవిస్తూ కొండలు పిండి చేసి పంటలు పండించి ఆధీనంలో ఉంచుకొని ఉండగా కొందరు అధికార పార్టీ రాగానే మా భూములు పై కన్నేసి భూములు ఆక్రమించేందుకు జెసిబిలతో యంత్రాలతో చదివిన చేస్తుండగా దళితులమైన మేము భూమి వద్దకు వెళ్లి అడ్డుకున్నామని మా భూములకు మాకు అందేలా తాసిల్దార్ సిద్దేశ్వర రావు చర్యలు తీసుకోవాలని సిపిఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ఆధ్వర్యంలో ఓబులవారిపల్లి తాసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు,

## భక్తుల స్వహస్తాలతో శ్రీ షిరిడీ సాయిబాబాకు పాలాభిషేకం

పుత్తూరు రూరల్, జూలై 7 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలోని టీబీ రోడ్డులో వెలసిన షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రతి సంవత్సరం ఆనవాయితీగా జూలై 2వ గురువారం నిర్వహించే పాలాభిషేక మహోత్సవం ఈ నెల 9వ తేదీ గురువారం ఉదయం 4.30 గంటల నుంచి 9 గంటల వరకు భక్తులు తమ స్వహస్తాలతో సాయిబాబాకు పాలాభిషేకం నిర్వహించేలా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సాయిబాబా నిత్య అన్నదాన సాంఘిక సేవా సమాజం వారు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో పాలాభేషం అనంతరం ప్రత్యేక పూజలు,భజన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

## విట్ ఛాన్సలర్ విశ్వనాధన్‌కు సన్మానం

తిరుపతి,జులై 7ప్రభాతవార్త:



వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ జి. విశ్వనాథన్‌ని బిజెపి నేతలు వేలూరులో కలిశారు. మంగళవారం మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలసి బిజెపి సీనియర్ నాయకులుగుండాలగోపీనాథ్‌రెడ్డి,వెల్లూరుజిల్లా బిజెపి అధ్యక్షుడు దశరథన్ దుశ్శాలువతో సన్మానించారు.

## నర్సింగ్ కళాశాలలో

### మహిళా పోలీసుల ప్రత్యేక అవగాహన

తిరుపతి,జులై 7ప్రభాతవార్త:




పోక్సో చట్టం, మహిళల హక్కులు సైబర్ నేరాలు బాల్య వివాహాల నివారణపై విద్యార్థినులకు సమగ్ర అవగాహన కల్పించారు. మంగళవారం మహిళా పోలీస్ స్టేషన్ అదనపు ఎస్పీ శ్రీలత ఆధ్వర్యంలో సిఐ తమీమ్ అహ్మద్ తిరుపతిలోని ఎస్‌వీఐఎంఎస్ నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు మహిళలు, చిన్నారుల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన 250 మంది విద్యార్థులు అధ్యాపకులు పాల్గొని అవగాహన పొందారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసుల అత్యవసర సేవల నంబర్ 112కు, మహిళల సహాయానికి 181కు, సైబర్ మోసాలకు 1930కు జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని తిరుపతి జిల్లా పోలీసులు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు దీపిక, కుళ్లాయప్ప, నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, తిరుపతి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుజాత, శక్తి బృందం,ఈగల్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్లను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించాలి

### - ఆశడే సందర్భంగా వినతులు



పుత్తూరు రూరల్, జూలై 7 ప్రభాతవార్త:

ఏఐటీయూసీ అనుబంధ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ డే సందర్భంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీలలో మెడికల్ ఆఫీసర్స్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పుత్తూరులో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.హేమావతి, పుత్తూరు డివిజన్ అధ్యక్ష కార్యదర్శి మారెమ్మ, ధనలక్ష్మిలు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు అనేక సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం 26 వేలకు తక్కువలేకుండా ఇవ్వాలని ఆశ వర్కర్స్ దగ్గర ఆశ వర్కర్స్ పని కాకుండా వేరే పనులు చేయించడం చాలా దుర్మార్గమని పేర్కొన్నారు. రాత్రి డ్యూటీలు వేయడం మానుకోవాలని,నాణ్యమైన ఫైవ్‌జీ సిమ్, సెల్‌ఫోన్లు నాణ్యమైన యూనిఫామ్‌లు ఇవ్వాలని ఆశ వర్కర్స్ పోరాటం సందర్భంగా అధికారులు కూటమి నేతలు అనేక హామీలు ఇచ్చారని వాటిని జీవోల రూపంలో విడుదల చేసి వెంటనే అమలుపరచాలని తెలిపారు. ఆశ వర్కర్స్ వేతనాలు పెంపు, ఆశ ఖాళీలను భర్తీ చేయాలని, బీఎల్‌వో డ్యూటీల నుంచి ఆశలను మినహాయించాలని, 2026 మార్చి 5 ఒప్పందాలకు వెంటనే జీవో ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఆశడే సందర్భంగా ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. అనంతరం పుత్తూరు, గొల్లపల్లి పీహెచ్‌సీలు నాయకులు ధనలక్ష్మి, వెంకటరమణమ్మ, బెస్తవీధి అర్బన్ పీహెచ్‌సీలో మారెమ్మ, పరమేశ్వరమంగళం పీహెచ్‌సీ నారాయణవనం పీహెచ్‌సీ, పిచ్చాటూరు పీహెచ్‌సీలో రాణి, కమ్మపల్లి పీహెచ్‌సీలో కాంతమ్మ, కుంప్ప, బాదూరు ప్రాంతాల్లో స్థానిక ఏఐటీయూసీ నాయకులతో కలసి ఆశ సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఆశ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి రానున్న కాలంలో ఆశ కార్మిక హక్కుల సాధన కోసం చేయవలసిన పోరాట కార్యక్రమాలకు ఈ సమావేశం రూపకల్పన చేయడం జరిగిందన్నారు. అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆశ వర్కర్లకు అందడం లేదని, ఆశ వర్కర్ల సంఖ్య పెంచాలని వైద్యాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, అన్ని పీహెచ్‌సీ ఆశ వర్కర్స్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు

## కమ్మపల్లి పిహెచ్‌సికి వైద్య పరికరాల వితరణ



రామచంద్రాపురం, జూలై 7 ప్రభాతవార్త:

కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మాజీ జడ్పీటిసి అబ్బూరి దేవానందం నాయుడు మంగళవారం వైద్య పరికరాలు వితరణ చేశారు. పిహెచ్‌సి ఆవరణలో ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ చినబాబు, డాక్టర్ జావెద్‌లకు ఆయన వైద్య పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలకు, ప్రభుత్వ పాఠశాలలకు దాతలు తమవంతు సహాయ సహకారాలు అందజేసి అభివృద్ధి చేయాలన్నారు. ఉచిత విద్య, వైద్యంతో ప్రజలు సుఖవంతమైన జీవితాన్ని పొందగలరన్నారు. ప్రభుత్వ వైద్యశాలల్లో అనుభవజ్ఞులైన వైద్య సిబ్బంది వున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ, టిడిపి నాయకులు సురేష్, సుధాకర్, మధు, మునిచంద్ర నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

రేణిగుంట జూలై 7 ప్రభాతవార్త



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ శ్రీ కట్ట పుట్టలమ్మ దేవస్థానం వద్ద సుమారు 4550 సంవత్సరాల మధ్య వయస్సు గల వ్యక్తి మంగళవారం ఉదయం మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. వివరాల్లోకి వెళితే శ్రీ కట్ట పుట్టలమ్మ దేవస్థానం వద్ద దాదాపు 45 నుండి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి మృతి చెందాడు. మృతుని పక్కన సగం తాగి మిగిలిన మద్యం సీసా ఉండడంతో సోమవారం రాత్రి మృతి చెందిన వ్యక్తి మద్యం సేవించి శరీరం డిహైడ్రేషన్ అవడంతో మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. చనిపోయిన వ్యక్తి ఎరుపు నలుపు రంగు గళ్ళ షర్టు ధరించి ఉన్నాడు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతుని ఆచూకీ తెలిసినవారు రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నందు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

## రేణిగుంట వాసికి జిల్లా యువ మోర్చాలో ఉన్నత పదవి

రేణిగుంట జూలై 7 ప్రభాతవార్త



రేణిగుంట పట్టణానికి ఎస్.ఆర్ వేణుగోపాల్ కు బిజెపి అనుబంధ జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా మోర్చా అధ్యక్షుడు బండారు సారధి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు జిల్లాస్థాయి పదవిలో నియమించినందుకు జిల్లా మోర్చా అధ్యక్షుడు బండారు సారథి, జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాసులు, రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ లకు వేణుగోపాల్ ధన్యవాదాలు తెలిపారు. గ్రామ గ్రామంలో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

## ఓటర్ల జాబితా వేగవంతంగా పూర్తి చేయాలి

### - తహసీల్దార్ మునిశైలజ



విజయపురం, జూలై 7 ప్రభాతవార్త:

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆలపాకం సచివాలయంలో విజయపురం మండల తహసీల్దార్ మునిశైలజ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం వేగవంతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు తగిన సలహాలు సూచనలు అందించారు. ప్రతి ఒక్క అర్హుడు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు అయ్యేలా చర్యలుతీసుకోవాలని కోరారు.ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని లేని పక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్‌తో పాటు డిప్యూటీ తహసీల్దార్ అశోక్, మండల సర్వేయర్ శేఖర్, బీఎల్‌వోలు, బీఎల్ఏలు ఉన్నారు.

## రెగ్యులర్ ఎంఈవో లేక విద్యా వ్యవస్థకు తీరని నష్టం - ఎస్టీయూ

విజయపురం, జూలై 7 ప్రభాతవార్త:

రెగ్యులర్ ఎంఈవో లేక విజయపురం మండలంలో విద్యా వ్యవస్థకు తీరని నష్టం వాటిల్లిందని ఉపాధ్యాయ ఎస్టీయూ నాయకులు ఆరోపించారు. మండలంలో నగరి ఎంఈవో ఇన్‌చార్జిగా పాలన సాగించడంతో అవగాహన లేకుండాఏకంగా 16 ఎంటీఎస్ ఖాళీలను చూపకుండా పోయారని ఆరోపించారు. మండలానికి రాకుండా నగరి నుంచి వ్యవహారాలు జరిపించడం వలన ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని, ఈ విషయమై రెండు పర్యాయాలు వినతి పత్రంసమర్పించినా పట్టించుకోకుండా పోయారని వాపోయారు. మండలంలో 16 ఎంటీఎస్ ఖాళీలు భర్తీ కాకపోవడంతో పలు పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారిందని, జిల్లా పునః వ్యవస్తీకరణలో భాగంగా ఉపాధ్యాయులు కేటాయించేటప్పుడు మండలానికి ప్రాధాన్యత ఇచ్చి ఎంటీఎస్ ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంమ్మార్సీ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, బాబు, వేణుప్రసాద్, శరవణన్, పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## టీబీ ముక్త్ భారత్ యాప్‌పై అవగాహన



వడమాలపేట, జూలై 7 ప్రభాతవార్త:

టీబీ ముక్త్‌భారత్ యాప్‌పై అవగాహన కార్యక్రమం మంగళవారం వడమాలపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జరిగింది. తిరుపతి జిల్లా కుష్టి, ఎయిడ్స్, క్షయ నివారణ అధికారిణి శైలజ ఆదేశాల మేరకు టీబీ ముక్త్ భారత్ యాప్ వల్ల ఉపయోగాలు గురించి వడమాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. అందరూ టీబీ ముక్త్ భారత్ యాప్‌ని తమ మొబైల్‌లో డౌన్‌లోడ్ చేసుకుని టీబీ నిర్మూలన లక్ష్యాన్ని సాధించడానికి తోడ్పడాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన టీబీ ముక్త్ భారత్ యాప్ ప్రజలు, ఆరోగ్య సిబ్బందికి అనేక విధాలుగా ఉపయోగపడుతుందని చెప్పారు. టీబీ అనుమానితులను గుర్తించి రెఫర్ చేయడానికి టీబీ రోగులను నమోదు చేసి చికిత్స పురోగతిని పర్యవేక్షించడానికి రోగులు క్రమం తప్పకుండా మందులు తీసుకునేలా గుర్తు చేసే సౌకర్యం ఇందులో ఉంటుందన్నారు. రోగులకు ప్రభుత్వ సేవలు, పథకాల సమాచారం తెలుస్తుందని తెలిపారు. ఆరోగ్య శాఖకు కూడా టీబీ కేసుల పర్యవేక్షణ, నివేదికల నిర్వహణ సులభమవుతుందని వివరించారు. రెండు వారాలకుపైగా దగ్గు, దగ్గులో కల్లె పడడం, కల్లెతో పాటు రక్తం పడడం, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి పూట చెమట పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో పరీక్ష చేయించుకోవాలన్నారు. టీబీ పూర్తిగా నయమయ్యే వ్యాధి అని మందులను వైద్యుల సూచనల మేరకు పూర్తి కోర్సు తీసుకోవడం ముఖ్యమని పేర్కొన్నారు. వడమాలపేట వైద్యాధికారి సందీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పురుషోత్తమరెడ్డి, సూపర్‌వైజర్లు మురళి, హెల్త్‌అసిస్టెంట్ వెంకటరాజు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, లలిత, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

## కోట గ్రామంలో చోరీ

### నగదు బంగారు దోచుకుపోయారు.?

చంద్రగిరి, జూలై 7 ప్రభాతవార్త:



కోట గ్రామానికి చెందిన గుడిబోయిన శ్రీలక్ష్మి రమేష్‌బాబు దంపతుల నివాసంలో సోమవారం రాత్రి దొంగలుపడి అందినకాడికి దోచుకుపోయారు. శ్రీలక్ష్మి వ్యవసాయ కూలీ పనులు చేసుకుం టూనే, ఇంట్లో చీరల వ్యాపారం చేసు కుని జీవనం సాగిస్తున్నారు. తల్లికి అనారోగ్యం కారణంగా తిరుపతికి వెళ్ళారు. మంగళవారం ఉదయం శ్రీలక్ష్మి కుమారుడు ఇంటికి వచ్చి చూడగా గేటుకు వేసిన తాళం అలాగే వున్నప్పటికీ ఇంటి మెయిన్ డోర్ తాళం పగులగొట్టి తలుపు తెరిచి వుండటంతో తల్లికి సమాచారం ఇచ్చాడు. దీంతో ఇంటికి చేరుకున్న ఆమె ఇంట్లో చోరీ జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అరుణాచలం కేసు దర్యాప్తు చేపట్టారు.

## భాజపా జిల్లా యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా ఎల్లా అన్వేష్ నియామకం



వరదయ్యపాలెం, జూలై 7, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీలో చిన్న స్థాయి పదవుల నుంచి పార్టీ విధేయతతో పనిచేసిన ఎల్లా అన్వేష్‌ను జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడిగా నియమి స్తూ జిల్లా పార్టీ పెద్దలు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎల్లా అన్వేష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, జిల్లా యువ మోర్చా అధ్యక్షులు బండారు పార్థసారథి, వరదయ్యపాలెం మండల అధ్యక్షులు దిలీప్ రాయల్‌తో పాటు వరదయ్యపాలెం మండల భాజపా సీనియర్ నాయకులు, కార్య కర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటూ జిల్లాలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్వేష్ ఈ సందర్భంగా తెలిపారు.

## చంద్రబాబు మాట అందరి బాట

### సీనియర్ టీడీపీ నాయకులను కలసిన ఎమ్మెల్యే ఆదిమూలం



సత్యవేడు, జూలై 7 ప్రభాతవార్త:

మండల పరిధిలోని మదనంబేడు పంచాయతీకి చెందిన సీనియర్ మాజీ ఎంపీటీసీ, టీడీపీ నాయకుడు వెంకటేశ్వరులు, నరేంద్ర ముదిరాజ్ ఇరువురిని వారి నివాసం వద్ద ఎమ్మెల్యే ఆదిమూలం మంగళవారం కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, మీ సేవలు టీడీపీ పార్టీకి బలోపేతం చేస్తాయని మీకు అండగా మీ వెంట నేను ఉంటానంటూ ఎమ్మెల్యే వెంకటేశ్వరులకు తెలిపారు. ఎమ్మెల్యేని గజమాలతో వెంకటేశ్వరులు సత్కరించారు. టీడీపీ యువ నాయకుడు నరేంద్ర ముదిరాజ్‌తో మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో యువతని మీ గ్రామంలోని పార్టీ శ్రేణులను కలుపుకుని మరింత చురుగ్గా పార్టీకి మీ సేవలు అందించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం ఎమ్మెల్యే, క్లస్టర్ ఇన్‌చార్జి వీకేఎన్ పరమశివం, స్వగృహానికి చేరుకుని పరమశివం తమ్ముడు వీకేఎన్ లీలాని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇళంగోవన్‌రెడ్డి, రవిరెడ్డి, సుందరరామిరెడ్డి, లోకనాథ్‌రెడ్డి, నరేంద్ర ముదిరాజ్, ఈశ్వరయ్య ముదిరాజ్, రాచంద్రనాయుడు పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

## చంద్రన్న అడుగుజాడల్లో నడుద్దాం - ఎమ్మెల్యే



సత్యవేడు, జూలై 7 ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాల్సిందేనని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం సత్యవేడు దళితవాడలో రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డ కుటుంబాలకు, తీవ్రంగా గాయపడ్డ వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. బాధితులకు మొత్తం 8 లక్షల రూపాయలు సీఎం సహాయనిధి నుంచి ఎమ్మెల్యే టీడీపీ నాయకులసమక్షంలో అం దజేశారు. వెలుగు ద్వారా బాధిత కుటుంబాలకు మరింతగా ఆర్థిక సహా యం అందే విధంగా చూడాలని ఎమ్మెల్యే ఆదేశిం చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సుం దర రామిరెడ్డి, ఇళంగోవన్‌రెడ్డి, జయరాంరెడ్డి, లోకయ్య రెడ్డి, రవిరెడ్డి, నరేంద్ర, యాచంద్ర, సంతోష్, పృథ్వి రాజ్, నాగరాజు, బక్కయ్య, కటయ్య, రమణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ ಕೆನರಾ ಬ್ಯಾಂಕ್ Canara Bank Together we can
యర్రావారిపాళెం శాఖ (13178)
ఫోన్: 85559 18460

బంగారు నగల వేలం ప్రకటన

ఇందుమూలముగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు తెలియజేయడమేమనగా మీరు మా బ్యాంకు వద్ద బంగారు నగలు తాకట్టు పెట్టి పొందిన ఋణమును తిరిగి చెల్లించలేదు. పలుమార్లు నోటీసులు పంపినను బట్వాడా కాకుండా తిరిగి వచ్చినది. 23.07.2026 వ తేదీ లోపు బకాయిలు,ఇతర ఛార్జీలను చెల్లించి తనఖా వుంచిన సెక్యూరిటీలను తిరిగి పొందగలరు. లేనియెడల బ్యాంకు శాఖ ఆవరణంలో తేది:24.07.2026 సా.4.00గం॥లకు లేదా బ్యాంకు నిర్ణయించిన ఏదేని తేదీలలో వేలం వేయుటకు బ్యాంకు వారికి అధికారం కలదు.

| వ. నెం. | ఖాతా నెం. | ఋణగ్రహీత పేరు & చిరునామా | బంగారు బరువు (గ్రాములలో) | బకాయి మొత్తం ఛార్జీలతో రూ. |
|---|---|---|---|---|
| 1 | 180138799568 | కె.మునికుమార్ తండ్రి నారాయణస్వామి, ఆవులయ్యగారి పల్లి, బోదేవాండ్లపల్లి, యర్రావారిపాళెం 517194 | 5.80 | 25451.00 |

తిరుపతి, తేదీ: 07.07.2026 సం॥ బ్రాంచ్ మేనేజర్, కెనరా బ్యాంకు

